క్లుప్తంగా

ప్రమాదకరంగా కల్వర్టు



ఇందిరానగర్ ఆర్చ్ వద్ద కాలువ అంచు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌కు వెళ్లే మలుపు వద్ద కాలువపై నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఆర్చ్ వద్ద కాలనీలోకి మలుపు తిరగాలి. ఈ మలుపు పక్కన కల్వర్టు అంచు శిథిలమైంది. దీంతో పాటు రక్షణ గోడ కూడా లేదు. ఈ కాలనీకి వెళ్లే వాహనచోదకులు ఇక్కడ మలుపు తిరుగుతుండగా అదుపు తప్పి కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రక్షణ గోడ నిర్మించాలని సచివాలయం సిబ్బంది, జీవీఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెద్ద ప్రమాదాలు జరగకముందే ఇక్కడ కల్వర్టుకు రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

17వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శ్రీనివాసరావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు పెద వాల్తేర్ దలాయి వారి వీధిలో నిర్మించిన సామాజిక భవనాన్ని మంగళవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.65 లక్షల వ్యయంతో ఈ సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తికావడంతో మేయర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. గ్రామ ప్రజలు ఎంత కాలంగా వేచిచూస్తున్న కల నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, వార్డ్ కార్పొరేటర్ లావణ్య, పట్టాభి, కాళ్ల శంకర్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


హోటల్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

పెదగంట్యాడ: స్థానిక సిద్ధేశ్వరం రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు రావడంతో హోటల్ యాజమాన్యంతో పాటు సిబ్బంది, కొనుగోలుదారులు భయంతో పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపకసిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు స్పందించారు. సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



తరుణ్‌ను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: బీహార్ రాష్ట్రం రాజగిరి పట్టణంలో జరిగిన ఖేలో ఇండియా యూత్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.తరుణ్ 81 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణ రెడ్డి పాల్గొన్నారు.

• వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, 2022 అక్టోబర్‌లో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన అర ఎకరం రెవెన్యూ స్థలాన్ని ఆరిలోవ రైతు బజార్ నిర్మాణం కోసం కేటాయించింది. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రూ. 80 లక్షలు కేటాయించి, 2023 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. అయితే 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదనే నెపంతో 80శాతం పూర్తైన పనులను ఆపేశారు. దీంతో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మార్కెటింగ్ శాఖ అధికారులు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుపై ఒత్తిడి పెరిగింది. ఫలితంగా అధికారులు మిగిలిన 20శాతం పనులను తిరిగి ప్రారంభించినప్పటికీ, వాటిని పూర్తి చేయడానికి ఆరు నెలలకు పైగా సమయం తీసుకున్నారు. ఇప్పుడు పనులు పూర్తయినా రైతు బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతుండటంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



తోటగరువు వద్ద రైతుబజార్ నిర్మాణం

రైతు బజార్ ప్రారంభమెప్పుడో..!



మరుగుదొడ్లు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం ఆరిలోవలో నిర్మించిన రైతు బజార్ ప్రారంభానికి నోచుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ నిర్మాణం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంకా అందుబాటులోకి రాలేదని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పలుమార్లు ప్రారంభోత్సవంపై హామీలు ఇచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. షాపులు, నిర్వహణ గదులు, ప్లాట్‌ఫాం, మరుగుదొడ్లు వంటి అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉన్నప్పటికీ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టకుండా జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఈ పాటికే రైతు బజార్ అందుబాటులోకి వచ్చేదని వారు అభిప్రాయపడుతున్నారు.

రైతుల కోసం షాపులు

ఈ రైతు బజార్‌లో రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు విక్రయించడానికి 98 షాపులు నిర్మించారు. వ్యాపారుల కోసం 5 కిరాణా షాపులు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు, ఈవో కార్యాలయం, స్టోర్ రూమ్, వాచ్‌మెన్ గది, పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, రైతులు, వినియోగదారుల కోసం తాగునీటిని అందించే ఆర్.వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది వంటి సదుపాయాలు కల్పించారు.



స్టాళ్లకు వేసిన నంబర్లు

ఆ ప్రాంతానికి ఎంతో అవసరం

ఆరిలోవ ప్రాంతంలో లక్ష మందికి పైగా జనాభా.. వారిలో అధిక శాతం పేదలు, డెయిరీఫారం, విశాలాక్షినగర్, పైనాపిల్‌కాలనీ, దారపాలెం వంటి పరిసర ప్రాంతాల ప్రజలు రైతు బజార్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసరాల కొనుగోలుకు ఎంవీపీకాలనీ, సీతమ్మధారలోని రైతు బజార్లకు ఆటోలు, బస్సుల్లో ప్రయాణించి అధిక ఖర్చులు, శ్రమతో కూడిన ప్రయాణాలు చేయాల్సి వస్తోంది.

ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చొరవతో రైతు బజార్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టింది. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఈ రైతు బజార్‌ను ఇంకా అందుబాటులోకి తీసుకురాకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైతు బజార్ లోపల కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరల పట్టిక బోర్డులు

ప్రజలకు ఎంతో అవసరం



ఆరిలోవ ప్రజలకు రైతు బజార్ ఎంతో అవసరం. దీని కోసం ఎదురు చూస్తున్నాం. ఇంత పెద్ద ప్రాంతం, ఎక్కువమంది ప్రజలు ఉండే ఇక్కడ ఇంతవరకు రైతు బజార్ లేకపోవడంతో ఎంవీపీకాలనీ వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ త్వరగా అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నా...

–నిక్కీరాం నాయక్, ఆరిలోవ,

త్వరగా ప్రారంభించాలి



ఆరిలోవ ప్రాంతం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇక్కడ రైతు బజార్‌ను వెంటనే ప్రారంభించాలి. ఇక్కడ రైతు బజార్ నిర్మాణం పనులు సంవత్సరాలు పాటు సాగదీశారు. ఇప్పుడు పనులు దాదాపు పూర్తయ్యాయి. అయినా దీన్ని అందుబాటులోకి తీసుకురాలేదు.

–పి.గణపతిరావు, టీఐసీ పాయింట్, ఆరిలోవ,

ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకోవాలి



ఆరిలోవ ప్రాంతానికి రైతు బజార్ అత్యంత అవసరమని, అందుకే తాను మేయర్‌గా ఎన్నికైన కొద్ది కాలంలోనే దానిని మంజూరు చేయించా..మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి రామకృష్ణబాబు రైతు బజార్‌ను నిర్మించలేకపోయారు. ఆరిలోవ ప్రజలకు ఆయన చేయలేని పనిని నేను మేయర్‌గా చేసి చూపించాను. రైతు బజార్‌ను అందుబాటులోకి తీసుకురావడంలో జరుగుతున్న జాప్యాన్ని ఆరిలోవ ప్రజలను చిన్నచూపు చూడటమే అవుతుంది. త్వరగా రైతు బజార్‌ను అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడుంది.

–గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్, 11వ వార్డు కార్పొరేటర్

వర్షం పడితే చెరువే!



బీఆర్‌టీఎస్ పెదగదిలి కూడలిలో నిలిచిపోయిన వరద నీరు..



వర్షపు నీటిలో వాహన చోదకుల ఇక్కట్లు



కూడలిలో పేరుకుపోయిన చెత్తను ఊడ్చి శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ పెదగదిలి కూడలి చిన్నపాటి వర్షానికే వరద నీరు చేరిపోయి చెరువును తలపిస్తోంది. భారీ వర్షాలు కురిస్తే ఇక్కడ వరద నీరు చేరి గంటలు తరబడి నిలిచిపోతోంది. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఈ కూడలిలో వరద నీరు చేరిపోయింది. ఆరిలోవతో పాటు కొండవాలు ప్రాంతాలు హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం తదితర ప్రాంతాలలో మంగళవారం వేకువ భారీ వర్షం కురిసింది. పెదగదిలి కొండవాలు నుంచి వరద నీరు ఈ రోడ్డు మీదకే చేరుతుంది. ఇక్కడ చేరిన నీరు కింద ఉన్న గెడ్డలోకి ప్రవహించడానికి సరైన మార్గం(కాలువ) లేదు. దీంతో గంటల తరబడి వరద నీరు ఈ కూడలిలో నిలిచిపోతోంది. ఆ సమయంలో వాహనచోదకులు ఈ నీటిలో రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు సైలెన్సర్లు దాటిన వరకు, ఆటోల టైర్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. వరద నీరంతా తగ్గిన తర్వాత ఉదయం పారిశుధ్య కార్మికులు అడుగున పేరుకుపోయిన మట్టి చీపుర్లతో ఊడ్చి రోడ్డు శుభ్రం చేశారు. వర్షం కురిసినప్పుడు ప్రతిసారీ ఇక్కడ ఇదే పరిస్థితి నెలకుంటోంది. అయినా జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఇక్కడ సమస్య పరిష్కరించకుండా వదిలేశారు.

తూనికలు, కొలతల్లో కచ్చితత్వం అవసరం



మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ రాజేష్

సీతంపేట: వరల్డ్ లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాయింట్ కంట్రోలర్ జి.రాజేష్, డిప్యూటీ కంట్రోలర్ కె.టి.రవి కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూకం, కొలతల్లో కచ్చితత్వం కోసం వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు. కొనుగోలు సమయంలో వస్తు నాణ్యత, వాటి తయారీ, తూనిక, కొలతలు, ఎమ్మార్పీ వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్యాకేజీ రూపంలో ఉండే ఏ వస్తువుకైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర వినియోగదారులు చెల్లించనవసరం లేదన్నారు. వినియోగదారులు ఎలా మోసపోతున్నారు, వ్యాపారులు ఎలా మోసగిస్తారో వివరించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర డిమాండ్ చేస్తే లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో విశాఖ కన్జ్యూమర్ కౌన్సిల్ చైర్మన్ రామారావు, ఫెడ్కో చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఆసరా ఫౌండేషన్ ప్రతినిధి శత్రుఘ్నుడు, అసిస్టెంట్ కంట్రోలర్లు పి.డి.వి.అప్పలరాజు, బి.రామచంద్రయ్య, పి.చిన్నమ్మ, ఇన్‌స్పెక్టర్ వి.రామారావు, ఎస్.ఉమా సుందరి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో నిఘా పెంచాలని డీఐజీకి వినతి

ఎంవీపీ కాలనీ: ఉగ్రవాద కార్యకలాపాల కలకలం నేపథ్యంలో ఉత్తరాంధ్రలో మరింత పోలీసు నిఘా పెంచాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ విజయనగరం వాసి సిరాజ్ అరెస్ట్‌తో ఉత్తరాంధ్రలోనూ ఉగ్ర కార్యకలాపాల లింక్ బయటపడిందన్నారు. ప్రశాంత వాతావరణం ఉండే ఉత్తరాంధ్రలో ఈ ఘటన ప్రజలను సర్వత్రా ఆందోళనకు గురిచేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఉగ్ర లింకులపై మరింత నిఘా పెట్టాల్సిన అవసరముందన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఐజీకి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా బంగారమ్మ తల్లి జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న పల్లా దుర్గారావు, రామచంద్రరావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పితానిదిబ్బ గ్రామంలో కొలువైన బంగారమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సంఘ సేవకుడు జీవీ రామచంద్రరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పార్కులో పారిశుధ్య లోపం



పార్కులో దుమ్ము పట్టిన బెంచీలు



పార్కులో తాగి పడేసిన మద్యం సీసాలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పారిశుధ్య కార్యాలయం చుట్టూ పారిశుధ్యం లోపించింది. వార్డులోని నెహూనగర్‌లో ఉన్న గ్రంథాలయం పార్కులో పారిశుధ్య కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం ఉన్న పార్కులో కనీస శుభ్రత పాటించడం లేదు. పార్కులోని బెంచీలు దుమ్ము పట్టి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇక మందుబాబుల సంగతి చెప్పక్కర్లేదు. మందు తాగేసి ఖాళీ సీసాలను పార్కులోనే పడేస్తున్నారు. అయినా అడిగే నాథుడు కరువయ్యారు. పారిశుధ్యం క్షీణించడంతో స్థానికులు ఎవరూ పార్కులోకి వెళ్లటం లేదు. ఇప్పటికైనా పారిశుధ్య సిబ్బంది పార్కును శుభ్రం చేసి స్థానికులు సేద తీరిలే చూడాలని కోరుతున్నారు.

సాగర తీరం.. దుర్గంధ భరితం

పొంగిపొర్లుతున్న యూజీడీ



విక్టరీ ఎట్ సీ వద్ద మురుగునీరు



కిర్లంపూడిలో ఉబికి వస్తున్న మురుగునీరు


ఏయూక్యాంపస్: సాగర తీరం దుర్గంధ భరితంగా మారుతోంది. వర్షం కురిస్తే మురుగు నీటి కూపంగా నిలుస్తోంది. ప్రధానంగా పర్యాటక కేంద్రంగా నిలచే విక్టరీ ఎట్ సీ చెంత మురుగు నీరు నిలచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. కిర్లంపూడి లే అవుట్‌లో యూజీడీ వ్యవస్థ నుంచి వచ్చే మురుగు నీరు విక్టరీ ఎట్ సీ వద్ద చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా యూజీడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. దీనిపై నుంచి మురుగు నీరు కాలువను తలపించే విధంగా ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది స్పందించిన దాఖలాలు లేవు. తరచూ ఇక్కడ ఇదే సమస్య ఉత్పన్నం అవుతోంది. తీరానికి వచ్చే పర్యాటకులు దీనిని చూసి ముక్కు మూసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. తగిన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

గార్మెంట్స్ మేకింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) సీతమ్మధార ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సహకారంతో ఈ నెల 23వ తేదీ నుండి మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమర్థ్ కార్యక్రమం క్రింద 18–40 సంవత్సరాల వయసు కలిగి, కనీసం 8 నుండి 10వ తరగతి వరకు చదువుకున్న మహిళలకు ఇండస్ట్రియల్ గార్మెంట్ మేకింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలం ముగిసిన తర్వాత వారికి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సర్టిఫికెట్లు అందజేసి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఈ శిక్షణ తరగతులు మే 23వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఆసక్తి ఉన్న వారు 63014 41183 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

• సింహగిరి మేఘసిరి

ఘాట్‌రోడ్డు నుంచి కిందికి చూస్తే కనువిందు చేసిన అద్భుత దృశ్యం



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహుని క్షేత్రమైన సింహగిరిని మంగళవారం కరిమబ్బులు గొడుగు పట్టాయి. కొండలపై నుంచి ఆలయ రాజగోపురం మీదికి జాలువారుతున్నట్లున్న మేఘాలను చూసి భక్తులు పరవశించారు. ఘాట్‌రోడ్డు మీదుగా కిందికి చూస్తే అడవివరం గ్రామంపైన వెండి మబ్బుల దోబూచులాట కనువిందు చేసింది. కొండలపై నుంచి వచ్చే మేఘాలను చూస్తూ పలువురు భక్తులు, యాత్రికులు తమ మొబైళ్లతో ఆ దృశ్యాలను బంధించడంలో బిజీ అయ్యారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

